



నోరు ఊరిస్తున్న కేకులు



శుభాకాంక్షలు తెలపడానికి రకరకాల పుష్పగుచ్ఛాలు



రంగవల్లులు కోసం కలర్స్



రకరకాల పూలతో న్యూ ఇయర్ పుష్పగుచ్ఛం

హ్యాపీ న్యూ ఇయర్

నూతన సంవత్సర వేడుకలకు నగరం ముస్తాబైంది. వీధి వీధినా సందడి నెలకొంది. ప్రజల్లో ఫుల్ జోష్ నెలకొంది. నవ చైతన్యం తొణికిసలాడింది. గత సంవత్సరంలో తీపి, చేదు జ్ఞాపకాల్ని మదిలో నిక్షిప్తం చేసుకుని, ఆశావహ దృక్పథంలో నూతన సంవత్సరానికి నగర ప్రజలు సాదర స్వాగతం పలికారు — సాక్షి ఫొటో గ్రాఫర్, గుంటూరు



న్యూ ఇయర్ కార్డులు



బోన్సాయి మొక్కలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు



బెలూన్స్

సంక్షేమ పథకాలతో సంతోషం నింపిన సీఎం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు వెస్ట్: గడిచిన 2022లో పలు సంక్షేమ పథకాల్ని పేద ప్రజలకు అందించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంతోషాల్ని నింపారని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు మద్దాళి గిరిధర్ తెలిపారు. 37వ డివిజన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని లక్ష్మీపురంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఇంటింటికీ వెళ్లారు. ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 తమ ప్రభుత్వానికి ఎంతో గుర్తుండిపోయే సంవత్సరమని తెలిపారు. లక్షలాది మంది అర్హులకు వేల కోట్ల రూపాయలు అందించడమే కాకుండా ఇంటి స్థలాల దగ్గర్నుంచి సంక్షేమ పథకాల వరకు అందించామని చెప్పారు. అందుకే ప్రజల ఆశీస్సులు తమకున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంతో పాటు డివిజన్లలో కూడా డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాల్ని చాలా వరకు పూర్తి చేయగలిగామని వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్ని క్షేత్రస్థాయిలో కలుసుకోవడమే కాకుండా వారి ఇబ్బందుల్ని గుర్తించి వాటిలో చాలా వరకు పరిష్కరించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొన్నా, ముఖ్యమంత్రి ప్రజల కష్టాలను, ఇచ్చిన మాటను మరచిపోలేదని తెలిపారు. అనంతరం 2023 నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానికులతో కలసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, 33వ డివిజన్ కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, డివిజన్ నాయకులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

కొత్త ఏడాదిలో విజయాలను కొనసాగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాదిలో సాధించిన విజయాల్ని పునశ్చరణ చేసుకుని నూతన సంవత్సరంలో వాటిని కొనసాగించేందుకు ప్రణాళికలు వేసుకోవాలని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్లకార్డుల్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, డాక్టర్ కృష్ణప్రసాద్‌తో పాటు ప్రిన్సిపాల్ వై.రాధినీ చౌదరి, ఏవో కె. వెంకట్రావు ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులతో కృష్ణప్రసాద్, రాధినీ చౌదరి

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ కేలండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ గుంటూరు జిల్లా శాఖ నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహమ్మద్ ఖాసీం, హెచ్ఎం బి.విజయలక్ష్మి ఆవిష్కరించారు. కొత్త ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. సంఘ నాయకులు సుధారాణి, సామ్రాజ్యం, ఎండీ ఆరిఫ్, షబీనా పర్వీన్, రాజ్యలక్ష్మి, యల్లమందరావు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్. దుర్గాప్రసాదరావు దంపతులు సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వేదమంత్రాల నడుమ న్యాయమూర్తి దంపతుల్ని సన్మానించారు. అనంతరం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వహణలో ధార్మిక ప్రాంగణంలో నిర్వహించిన చండీ హోమంలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న న్యాయమూర్తి దంపతులు

సహకార బ్యాంక్ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను బ్రాడీపేటలోని ప్రధాన కార్యాలయంలో శనివారం చైర్మన్ లాలుపురం రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది, జిల్లాలోని రైతులు, ప్రజలకు ఆయన నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యుడు కోట హరిబాబు, బ్యాంకు సీనియర్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎం గోడౌన్లను డీఆర్వో చంద్రశేఖరరావు తనిఖీ చేశారు. ఆయన వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు. తనిఖీ అనంతరం డీఆర్వో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమలో 144 సెక్షన్

నగరంపాలెం: నూతన సంవత్సర వేడుకను పురస్కరించుకుని శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం సాయంత్రం వరకు గుంటూరు పశ్చిమలో 144 సెక్షన్ అమలవుతుందని గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ కె.సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.